క్లుప్తంగా

స్టేర్ లిఫ్ట్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలోని గాలిగోపురం వద్ద ఏర్పాటు చేసిన స్టేర్ లిఫ్ట్‌కు గురువారం మరమ్మతులు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా స్టేర్ లిఫ్ట్ పని చేయడం లేదు. దీంతో అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వృద్ధులు, వికలాంగులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' బుధవారం 'తరచూ మొరాయిస్తున్న స్టేర్ లిఫ్ట్' పేరిట కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన ఆలయ ఇంజినీరింగ్ అధికారులు టెక్నికల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన ఆలయానికి చేరుకుని మరమ్మతులు నిర్వహించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గత కొద్దిరోజులుగా మరమ్మతులకు గురైన స్టేర్ లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకురావడంపై భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

12న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

మాఘమాసం నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉండే ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. మాఘ పౌర్ణమి నేపథ్యంలో ఈ నెల గిరి ప్రదక్షిణలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉందని దేవస్థానం భావిస్తూ అందుకు తగిన రీతిన ఏర్పాట్లు చేస్తోంది. 12వ తేదీ బుధవారం తెల్లవారుజామున 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కొలువుదీరుతారు. ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం గిరి ప్రదక్షిణను ఆరంభిస్తారు. కుమ్మరి పాలెం, విద్యాధరపురం, సితారా జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, కేఎల్‌రావు నగర్, చిట్టినగర్, కేటీరోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంటుంది. ప్రతి నెలా పౌర్ణమిన జరిగే గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ద్వారా భక్తులు మనోభీష్టం నెరవేరడమే కాకుండా వారి ఇంట ఎటువంటి కష్టాలు దరిచేరవని నమ్మకమని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు కె.నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. మృతుడు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఆర్థిక ఆసరా కల్పించేందుకు పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోంగార్డులు వారి ఒక రోజు వేతనం జమ చేసి రూ. 5 లక్షలను సమకూర్చారు. ఈ చెక్కును నాగేశ్వరరావు భార్యకు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత, హోంగార్డ్స్ ఆర్ఐ కె.సుధాకర రెడ్డి పాల్గొన్నారు.

విధేయత కలిగి జీవించాలి

గుణదల(విజయవాడ తూర్పు): దేవుని పట్ల విధేయత కలిగి ఉంటే జీవితాలు ఆశీర్వాదకరంగా ఉంటాయని ఈదులగూడెం విచారణకర్త ఫాదర్ కూచిపూడి ప్రశాంత్ అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనలు ఏడో రోజుకు చేరుకున్నాయి. గురువారం జరిగిన ప్రార్థనలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సాధారణ స్త్రీ అయిన మరియ దేవునికి విధేయురాలిగా ఉంది కనుకనే దేవుడు ఆమె గర్భవాసాన జన్మించాడని పేర్కొన్నారు. లోక రక్షకుడైన క్రీస్తును ఈ లోకానికి అందించిన దివ్యమాతగా ఆమె కీర్తినొందుతోందని వివరించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. అంతకు ముందు పలు విచారణల నుంచి వచ్చిన భక్తులు కొవ్వొత్తులు చేతబూని జపమాల ధ్యానంతో మరియమాత స్వరూపం వద్దకు చేరుకున్నారు. అక్కడ బలి పీఠం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, ఫాదర్ సునీల్ రాజు పాల్గొన్నారు.

ప్రమాదాలకు జంక్షన్

- రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లలో పర్యవేక్షణ శూన్యం
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టని వైనం
- హెల్మెట్ కేసులతోనే సరిపెడుతున్న ట్రాఫిక్ పోలీసులు

నగరంలో ట్రాఫిక్ నియంత్రణ అస్తవ్యస్తం



బైపాస్ రోడ్డులో అట్కిన్‌సన్ జంక్షన్ వద్ద కారును ఢీకొట్టిన లారీ(ఫైల్)



వాహనాల రద్దీతో మలుపులో ఏర్పడిన పెద్ద గొయ్యి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ట్రాఫిక్ పోలీసుల విధులు పూర్తిగా మారిపోయాయి. వాహనదారులు హెల్మెట్ ధరించారా? లేదా చూడడం.. వాళ్లను ఆపి కేసులు రాయడం.. అంతే ఆ పూటకు విధులు ముగిసినట్లే! హెల్మెట్ ధరిస్తే ప్రమాదం జరిగినపుడు ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు.. కానీ అసలు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అమ్మో అట్కిన్‌సన్ జంక్షన్..

అట్కిన్‌సన్ జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. భారీ రవాణా వాహనాలు సైతం ఈ జంక్షన్ మీదుగా కబేళా వైపు వెళ్తుంటాయి. రోజులో ఒకటి రెండు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఉదయం సాయంత్రం వెయ్యి మందికి పైగా స్కూల్ విద్యార్థులు కొందరు తల్లిదండ్రుల వాహనాలపై, మరికొందరు సైకిళ్లపై, ఇంకొందరు నడుచుకుంటూ ఈ జంక్షన్ నుంచి స్కూల్‌కు వెళ్తుంటారు. తల్లిదండ్రుల బైక్‌లపై వచ్చే వారి సంగతి పక్కనబెడితే.. సైకిల్‌పై, కాలినడకన వచ్చే వారి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. పెద్ద పెద్ద ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు వేగంగా వస్తున్నాయి. చిన్న చిన్న వాహనాలను గమనించకుండా ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ జంక్షన్‌లో ఏ వాహనం ఎటువెళుతుందో గుర్తించడం కూడా కష్టమే. స్కూల్ సమయంలోనే కంచికచర్ల, నందిగామ, కేతనకొండ, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థుల బస్సులు రాకపోకలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. అదే సమయంలో నగరం వెలుపల నుంచి స్కూల్స్, కాలేజీలకు వచ్చే బస్సులు ఎక్కువే. ఈ జంక్షన్‌లో రోడ్డు పెద్ద గోతులు పడి అధ్వానంగా ఉంది. బైక్‌లు, సైకిల్‌పై వచ్చే వారు గోతుల వద్ద నెమ్మదిగా వస్తుంటే వెనుక వచ్చే పెద్ద వాహనాలు మీదకు దూసుకుని వస్తున్నాయి.

> **గొల్లపూడి నుంచి మొదలు..**
>
> గొల్లపూడి వద్ద సిటీ పరిధి ప్రారంభమవుతుంది. ఇక్కడ ఓ వైపు హైవే.. మరో వైపు బైపాస్ రోడ్డు ఉన్నాయి. ఈ రోడ్డు గుండానే నగరంలోకి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మైలు రాయి జంక్షన్, హోల్ సేల్ మార్కెట్ వద్ద డివైడర్, అట్కిన్‌సన్ స్కూల్ జంక్షన్, చర్చి సెంటర్ జంక్షన్‌లు అతి పెద్దవి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటాయి.

వరుస ప్రమాదాలు..

అట్కిన్‌సన్ జంక్షన్‌లో సారంగం వైపు వస్తున్న కారును, కబేళా వైపు మలుపు తిరిగే బస్సు ఢీకొట్టింది. ఆ రెండు వాహనాలు ఢీకొట్టిన సమయంలో అక్కడే విద్యార్థులు స్కూల్‌కు నడుచుకుంటూ వెళుతున్నారు. ఇక మార్కెట్‌కు సరుకు రవాణా చేసే మూడు చక్రాల ఆటోలు గాల్లో తేలుతూ వస్తున్నాయి. ఇటీవల స్కూటీపై వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టి తీవ్ర గాయాలయ్యాయి. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం స్కూల్ సమయాల్లో భారీ వాహనాలను దారి మళ్లించే పని చేయడం లేదు. ఆ సమయంలో ట్రాఫిక్ కంట్రోల్ చేసే పనులు చేయడం లేదు. కేవలం హెల్మెట్ కేసులు రాయడం చేతులు దులుపుకుని వెళ్లడం తప్ప.. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఇక గొల్లపూడి దత్త కల్యాణ మండపం నుంచి ఇటు భవానీపురం స్వాతి రోడ్డు, వరకు ఇటువైపు మైలు రాయి నుంచి సితార జంక్షన్ వరకు రోజూ ఏదో ప్రమాదం జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. కొన్నింటిలో కేసులు నమోదు చేస్తున్నారు. మరికొన్ని ప్రమాదాలు అక్కడికక్కడే సర్దుబాటు చేసుకుని వెళుతున్నారు. హెల్మెట్ కేసులపై దృష్టి పెడుతూనే ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

> **చర్యలు తీసుకోవాలి..**
>
> అట్కిన్‌సన్ జంక్షన్ వద్ద ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. అక్కడ నుంచి మార్కెట్లోకి వెళ్లే వాహనాలు వేగంగా మలుపుతిప్పుతున్నారు. ద్విచక్ర వాహనదారులు దీనిని గమనించలేకపోతున్నారు. ఈ జంక్షన్‌లోనే రెండు రోజుల క్రితం నాకు కూడా ప్రమాదం జరిగింది. ఆటో ఢీకొట్టడంతో కిందపడిపోయా. స్వల్పగాయాలతో బయటపడ్డా. పోలీసులు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలి.
>
> – జి. సాయి కుమార్, గొల్లపూడి

యువతుల అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టేనర్‌పేట శ్రీనివాసరావు వీధికి చెందిన భౌరిశెట్టి శ్రీనివాసరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. శ్రీనివాసరావుకు ముగ్గురు ఆడపిల్లలు. మూడో కుమార్తె సుకన్య డిగ్రీ వరకు చదివింది. కబేళా సెంటర్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న సుకన్య ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కొత్త పేటలో మరో యువతి..

ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రైజర్‌పేట తెలుగు బాపిస్టు చర్చి సమీపంలోని వేదనం వారి వీధిలో తిప్పల వెంకట శ్యామల, ఐరెడ్డి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం కాగా కుమార్తె రేణుకా(20) ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తుంటారు. ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన రేణుక రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో స్నేహితులు, బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

9న శతాధిక మృదంగ వాద్య నివాళి

విజయవాడ కల్చరల్: దండమూడి రామ్మోహనరావు లయ వేదిక సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 9వ తేదీ ఆదివారం సాయంత్రం దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో శతాధిక మృదంగ లయ వాద్య నివాళి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకురాలు దండమూడి సుమతీ రామ్మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత విద్వాంసులు అయ్యగారి శ్యామసుందర్, జయలక్ష్మి శ్యామసుందర్, ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది మృదంగ విద్వాంసులను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు.

బీసీ కులగణన సాధించేందుకు పోరుబాట

బీఎస్పీ ఏపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు



సంఘీభావం తెలుపుతున్న బీసీ సమన్వయ కమిటీ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలంగాణ బీసీల ఉద్యమ స్ఫూర్తితో ఏపీలో బీసీ జనగణన కోసం పోరుబాట పట్టనున్నట్లు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ డాక్టర్ జుజ్జవరపు పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. విజయవాడ హరిత బెరంపార్క్‌లోని సమావేశ మందిరంలో ఏపీ బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కార్యవర్గ శిక్షణ తరగతులలో భాగంగా తొలి రోజు గురువారం ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం కులగణనపై కేబినెట్‌లో ఎందుకు చర్చకు పెట్టడం లేదని ప్రశ్నించారు. బీసీల మనుగడకు రాజ్యాధికారం, రాజకీయ ప్రాతినిధ్యానికి కులగణన తప్పనిసరని అన్నారు.

శ్వేతపత్రం ఏది?

రాష్ట్రంలోని పలు సమస్యలపై శ్వేతపత్రాలను విడుదల చేసిన చంద్రబాబు ప్రభుత్వం కులగణనపై ఎందుకు ఇవ్వలేదని పూర్ణచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు అధికారాన్ని పంచటం నేర్చుకోమని కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. సమావేశంలో బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ అంగడాల పూర్ణచంద్రరావు, రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, వీఆర్ నారగోని తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలు, రేషన్ డిపోల్లో తనిఖీలు



ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న సహాయ పౌర సరఫరాల అధికారి శ్రీనివాసరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎండీయూ ఆపరేటర్లు రేషన్ కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని, కార్డుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని విజయవాడ సర్కిల్–2 సహాయ పౌర సరఫరాల అధికారి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి పాపారావు ఆధ్వర్యంలో గురువారం సర్కిల్–2 ఏరియాలోని రేషన్ డిపోలను, ఎండీయూ వాహనాలను సెంట్రల్ ఎంఆర్‌ఓ మద్దినేని వెంకటరామయ్యతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాణిగారితోటలోని 289, భ్రమరాంబపురంలోని 315 రేషన్ డిపోలను, ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు ప్రకారం స్టాక్ నిల్వలు, స్టాక్ బోర్డులను పరిశీలించారు. సక్రమంగా నిత్యావసరాలు అందుతున్నాయా లేదా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్డుదారులందరికీ నిత్యావసరాలు పంపిణీ చేయాలని, వారి నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ డిపోలు, ఎండీయూ వాహనాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులు కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. తనిఖీల్లో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ మణికంఠ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను ముంచిన ఫైనాన్స్ సంస్థ

- రుణాల పేరిట ఒక్కో మహిళ నుంచి రూ. 2 వేల వరకు వసూలు
- పోలీసుల అదుపులో నిర్వాహకులు



భవానీపురంలోని సంస్థ కార్యాలయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో మరో ఫైనాన్స్ కంపెనీ మోసం వెలుగులోకి వచ్చింది. గృహ, వ్యక్తిగత, మార్టిగేజ్, హై టాప్ అప్, బిజినెస్, గ్రూప్ రుణాల పేరుతో ఓం ఫైనాన్స్ సర్వీస్ సంస్థ వెలిసింది. సంస్థ భవానీపురంతో పాటు ఆటోనగర్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేసి కార్యకలాపాలు సాగిస్తోంది. ముఖ్యంగా మహిళలకు గ్రూపు రుణాలు ఇప్పిస్తామని చెప్పి వారికి ఎరవేసింది. 10 మంది సభ్యులతో గ్రూప్ ఏర్పాటు చేసి ఒక్కొక్కరు రూ. 2వేలు చెల్లిస్తే 45 రోజుల తర్వాత రుణాలు ఇప్పిస్తామంటూ నిర్వాహకులు నమ్మబలికారు. కొందరు మహిళలు గ్రూపులుగా ఏర్పడి ఒక్కొక్కరు రూ. 1,600 నుంచి రూ. 2వేల వరకు సంస్థకు చెల్లించారు. ఇలా దాదాపు రూ. 12లక్షల వరకూ వసూలు చేశారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల వారికి అందించే రుణాలకు సంబంధించిన పత్రాలను వాడుతున్నట్లు తెలిసింది. 45 రోజుల గడువు పూర్తి కావడంతో రుణాల కోసం సంస్థ కార్యాలయానికి వెళ్లి ఆరా తీశారు. సిబ్బంది నుంచి సరైన స్పందన లేకపోవడంతో వారంతా ఆందోళన చేపట్టి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళల నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసులు స్పందించి సంస్థ కార్యాలయాలకు తాళాలు వేయించారు. మహిళలు ఇచ్చిన ఫిర్యాదు వ్యవహారాన్ని గోప్యంగా ఉంచిన పోలీసులు సంస్థ కార్యకలాపాలపై కూపీ లాగుతున్నారు.

అప్రమత్తమైన పోలీసులు

ప్రస్తుతం ఫైనాన్స్ సర్వీస్ నిర్వాహకులు నలుగురు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. నలుగురిలో ఇద్దరు భవానీపురం, ఒకరు కంచికచర్ల బత్తినపాడు, మరొకరు తాడిగడపకు చెందిన వారిగా తెలిసింది. ఇప్పటికే పోలీసులు సంస్థ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గ్రూపులుగా ఏర్పడి సంస్థకు డబ్బులు చెల్లించిన వారి నుంచి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. దీని వెనుక ఎవరున్నారు? బాధితులు ఎంత మంది రుణాల కోసం దరఖాస్తు చేశారు? వంటి వివరాలు తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. గతంలో కొన్ని సంస్థలు ఇలాంటి తరహా మోసాలకు పాల్పడటంతో ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తమైన పోలీసులు ఈ ఫైనాన్స్ సంస్థ వ్యవహారంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఫైనాన్స్ సర్వీస్ సంస్థకు ఎటువంటి అనుమతులు లేవని తెలిసింది. సంస్థ వ్యవహారంపై వెస్ట్ ఏసీపీ దుర్గారావును వివరణ కోరగా.. ఫైనాన్స్ సంస్థ మహిళల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం ఉందని, ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా సంస్థ రికార్డులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై అన్ని కోణాల్లో విచారిస్తున్నామని తెలిపారు. వాస్తవమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జ్ఞానవంతమైన పౌరులుగా ఎదగాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు జ్ఞానవంతమైన పౌరులుగా ఎదిగినప్పుడే సమాజానికి మేలు కలుగుతుందని ఓఎన్‌జీసీ మాజీ డైరెక్టర్ సీఏకేఎం పద్మనాభన్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'స్వామి వివేకానంద స్ఫూర్తితో–మేల్కొని– ఆలోచించు' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన పద్మనాభన్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యను అభ్యసించటమే కాకుండా జ్ఞానాన్ని సంపాదించటం, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, జీవన నైపుణ్యాలను అభివృద్ధి పరచుకునేందుకు పాటుపడాలన్నారు. తద్వారా వ్యక్తిగత మానసిక వృద్ధి జరిగి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో జరుగుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణకుమార్ అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్స్ ఏ పతంజలిశాస్త్రి, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ ఏ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన అజయ్‌జైన్ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

మెరుగైన పారిశుద్ధ్యానికి 'మినీ స్టేషన్లు'

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



గార్బేజ్ స్టేషన్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు మినీ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం నగర పర్యటనలో భాగంగా ఆయన సాంబమూర్తి రోడ్, ధర్నా చౌక్, పూర్ణానందపేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం సాంబమూర్తి రోడ్లో ఏర్పాటు చేసిన మినీ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించి, నగరంలో ఇలాంటి స్టేషన్లు అవసరమైన చోట ఏర్పాటు చేయాలని, స్టేషన్ ముందు అందంగా కనిపించేందుకు, కాలుష్యాన్ని అరికట్టేందుకు పచ్చటి మొక్కల్ని నాటేలా ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఇదే ప్రాంతంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్లను పరిశీలించారు.

- అనంతరం ఆయన పూర్ణానందంపేటలో పర్యటించి రోడ్లపై ఎలాంటి ఆక్రమణలు జరగకుండా, వ్యాపారులు వారి ప్రాంతాల్లోనే వ్యాపారాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ అంతరాయం కలిగించే ఆక్రమణలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు.
- ధర్నా చౌక్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. నిర్ణీత సమయంలో క్యాంటీన్‌లను ఓపెన్ చేయాలని, నిర్ణీత టోకెన్లు అన్ని ప్రజలకు అందేటట్టు అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, సూపరింటెండింగ్ ఇంజినీర్ పి. సత్యకుమారి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ఆర్ఎస్ఐ శివరామకృష్ణ, హెచ్ఎం కృష్ణమోహన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని 45వ డివిజన్ పరిధిలోని శ్రీదుర్గమల్లేశ్వర యండూరి రామలింగేశ్వరరావు (ఎస్‌డీఎంవైఆర్ఆర్) హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. హైస్కూల్ యాజమాన్యం, వీడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒకటో ట్రాఫిక్ ఆర్ఎస్ఐ పి. శివరామకృష్ణ పాల్గొని రహదారి భద్రత నియమాల గురించి వివరించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా వారి విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని అన్నారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ద్విచక్ర వాహనదారుడు వేగ పరిమితి, నిషేధించిన పార్కింగ్, ప్రవేశ మార్గం వంటి ఇతర సమాచార సూచికల బోర్డ్‌ను అనుసరించాలని పేర్కొన్నారు. పాఠశాలకు తమ పిల్లలను తీసుకువచ్చే తల్లిదండ్రులు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వాసు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మొగులూరి కృష్ణమోహన్, ట్రాఫిక్ వార్డెన్ ఎస్కే రఫీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి మనీషారెడ్డి అన్నారు. నున్న గ్రామంలోని వికాస్ కాలేజీలో మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, ర్యాగింగ్, ట్రాఫిక్ నిబంధనలపై నున్న పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వివిధ నేరాలు, శిక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనీ ఐపీఎస్ అధికారి మనీషారెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు విలువైన జీవితాలను నాశనం చేస్తాయని, వాటిని దరి చేరనివ్వరాదని సూచించారు. గంజాయి విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. కళాశాలల్లో విద్యార్థులు గంజాయిలాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. అదే విధంగా తెలియని వ్యక్తుల ద్వారా వచ్చే మెసేజ్‌లకు రెస్పాండ్ కావద్దన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

దామర్ల చిత్ర సంపదను పరిరక్షించాలి

విజయవాడ కల్చరల్: చిత్రకారుడు దామర్ల రామారావు చిత్ర సంపదను ప్రభుత్వం పరిరక్షించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి అహ్మద్ ఇంతియాజ్ అన్నారు. రాష్ట్ర చిత్రకళాకారులు, సాహిత్య సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విఖ్యాత చిత్రకారుడు దామెర్ల రామారావు శత వర్ధంతి సభ, బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ తెలుగు వారు గర్వించదగిన చిత్రకారుడు దామెర్ల అని కొనియాడారు. దామెర్ల జీవించినది 28 ఏళ్లే అయినా ఆయన చిత్రాలు చిరంజీవులని అభివర్ణించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ రాజమండ్రికి చెందిన దామెర్ల గీసిన చిత్రాల ద్వారా శాశ్వతమైన కీర్తిని సంపాదించుకున్నట్లు తెలిపారు. చిత్రకారుడు కళాసాగర్ మాట్లాడుతూ రాజమండ్రిలోని దామెర్ల ఆర్ట్స్ గ్యాలరీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. అనంతరం అతిథులు దామెర్ల చిత్రాలతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు స్ఫూర్తి శ్రీనివాస్, కార్టూనిస్ట్ టీవీ, టీకే మృత్యుంజయరావ్, డ్రీమ్ రమేష్, గంధం ప్రసాద్, సునీల్‌కుమార్, మురళీకృష్ణతోపాటు సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.